క్లుప్తంగా

వీరవాసరం ఎస్ఐగా ఎం.రాజ్‌కుమార్


ఎస్ఐ ఎం.రాజ్‌కుమార్

వీరవాసరం: వీరవాసరం ఎస్ఐగా ఎం.రాజ్‌కుమార్ సోమవారం బాధ్యతల స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరక్కుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ వ్యవస్థకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు.

క్రీడాకారుడికి అభినందనలు


బాడ్మింటన్ క్రీడాకారుడిని అభినందిస్తున్న మోషేనురాజు

భీమవరం: ఆంధ్రాయూనివర్శిటీ సౌత్‌జోన్ బాడ్మింటన్ పోటీల్లో రన్నర్‌గా నిలిచిన బొడ్డు మహేష్‌ను శాషనమండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు సోమవారం తన క్యాంపు కార్యాలయంలో అభినందించారు. భీమవరం డీఎన్నార్ కళాశాలలో నిర్వహించిన బాడ్మింటన్ పోటీల్లో భీమవరం మండలం గొల్లవాని తిప్ప గ్రామానికి చెందిన మహేష్ రన్నర్‌గా విజయం సాధించాడు.

నత్తనడకన రైల్వే లిఫ్ట్ పనులు


ఆకివీడు రైల్వే స్టేషన్‌లో పునాది దశలో లిఫ్ట్

ఆకివీడు: స్థానిక రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేస్తున్న లిఫ్ట్ పనులు పునాదుల్లోనే నిలిచిపోయాయి. లిఫ్ట్ ఏర్పాటుకు నిధులు మంజూరై నెలలు గడుస్తున్నా పనులు మాత్రం పునాదుల్లోనే ఉన్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. స్టేషన్‌లోని మొదటి ప్లాట్ ఫారమ్ నుంచి రెండో ప్లాట్ ఫారమ్‌నకు వెళ్లేందుకు వృద్ధులకు, వితంతువులకు, మహిళలకు అనువుగా ఉండేందుకు లిఫ్ట్‌ను రైల్వే శాఖ మంజూరు చేసింది. అయితే ఈ పనులను వేగవంతం చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం జరుగుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భీమవరం నుంచి వచ్చే రైళ్లు మొదటి ప్లాట్ ఫారమ్‌లోనూ, విజయవాడ నుంచి వచ్చే రైళ్లు రెండో ప్లాట్‌ఫారమ్‌లో ఆగుతాయి. అయితే రెండో ప్లాట్ ఫారమ్‌నకు వెళ్లాలంటే ఫైఓవర్ బ్రిడ్జి ఉన్న ప్పటికీ వృద్ధులు, మహిళలు, చిన్నారులు, దివ్యాంగులు వెళ్లలేకపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి లిఫ్ట్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఎట్టకేలకు గుంతల పూడ్చివేత

సాక్షి స్పందన

ఆకివీడు: జాతీయ రహదారిపై ఉండి రైల్వే గేటు వద్ద ఏర్పడిన భారీ గుంతలను జాతీయ రహదారుల శాఖ అధికారులు పూడ్చిస్తున్నారని వినియోగదారుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి బంగారయ్య చెప్పారు. సోమవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించగా గుంతల్లో గ్రావెల్ వేసి పూడ్పిస్తున్నారని, డ్రోజర్‌తో పనులు చేయిస్తున్నట్లు వివరించారు. ఇటీవల సాక్షిలో గోతులు పూడ్చరా? ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోయిన తరువాత పూడుస్తారా అనే శీర్షికతో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారన్నారు. జాతీయరహదారిని ఉప్పుటేరు వరకూ మరమ్మతులు చేయించాలని, ఆకివీడు సెంటర్ నుంచి ఏఎంసీ వరకూ రహదారిపై వర్షపు నీరు నిలబడి ఉంటుందని, దీనిని తొలగించేందుకు కచ్చా డ్రెయిన్లు తవ్వాలని, రోడ్డు మార్జిన్లు పూడ్చిన ప్రాంతంలో మట్టి తొలగించి, ఆక్రమణలను తొలగించాలని బంగారయ్య డిమాండ్ చేశారు.

వైభవంగా నడివీధి వేడుక


అమ్మవారిని నడి వీధికి తీసుకువస్తున్న దృశ్యం

కాళ్ల: స్థానిక మద్దిరావమ్మ జాతర మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాటు చేస్తున్నారు. దీనిలో భాగంగా అమ్మవారిని నడివీధికి తీసుకుని వచ్చే వేడుక ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. రామాలయం కూడలిలో పూరిగుడిసె ఏర్పాటు చేసి అమ్మవారి ప్రతిమను నిలబెట్టి పూజలు నిర్వహించారు. ఈ నెల 24 గురువారం అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

శిథిలావస్థలో ప్రభుత్వ కార్యాలయాలు

కార్యాలయ భవనాలపై పెరిగిన మొక్కలను శుభ్రం చేయని వైనం


నిరుపయోగంగా ఉన్న హాస్టల్ భవనం

ఆకివీడు: ఇటీవల ప్రభుత్వం, అధికారులు స్వచ్ఛతా హీ సేవ పేరుతో ప్రత్యేక స్వచ్ఛతా వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించడంతో పాటు గ్రామాలను శుభ్రం చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యమని అధికారులు ఉపన్యాసాలు ఇస్తున్నారు. అయితే ప్రభుత్వ భవనాలకు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం వర్తించదా? అని ప్రజలు మండిపడుతున్నారు. నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ భవనాలు సంబంధిత అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల శిథిలావస్థకు చేరుతున్నాయి. గ్రామాల్లోనూ, పట్టణాల్లో స్వచ్ఛతా హీ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినట్లు అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి ఫొటోలు దిగారు. తీరా ఆయా గ్రామాలు వెళ్లినా, పట్టణం, మండల కేంద్రం వెళ్లినా ప్రభుత్వ భవనాలు వెక్కిరిస్తున్నట్లుగా అశుభ్రతతో నిండి ఉన్నాయి. ప్రతి రోజూ యధావిధిగా పనిచేసే ప్రభుత్వ కార్యాలయాలు, కొన్ని ప్రభుత్వ పాఠశాలల భవనాల పైన పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగి, గోడలను, పిట్ట గోడలను పగలుగొడుతున్నా పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రతి ప్రభుత్వ భవనం పైభాగంలో నీరు నిలబడిపోయి, మొక్కలు పెరిగి గోడలను పగులగొడుతున్నాయి. వర్షపు నీరు మొక్కల వేళ్ళ నుంచి స్లాబ్‌లలోకి చొచ్చుకువెళ్లి శ్లాబ్‌లను పగలగొడుతున్నాయి. దీంతో శ్లాబ్‌పై పెచ్చులు ఊడుతున్నాయి.

ఉపన్యాసాలు తప్ప పనులేవి?

స్వచ్ఛతా హీలో ప్రభుత్వ కార్యాలయాలపైన, ప్రాంగణాల్లో ఏ విధమైన పనులు చేపట్టలేదు. కొన్ని చోట్ల మాత్రం ప్రాంగణాల్లో పిచ్చిమొక్కలు పీకించారు. కార్యాలయాలు ధ్వంసాన్ని అరికట్టేందుకు పిచ్చి మొక్కల తొలగింపుపై దృష్టి పెట్టలేదు. ఇల్లు చక్కదిద్దుకోలేనివాళ్లు ఊరును ఉద్ధరిస్తారా? అంటూ ప్రజలు ఎద్దేవా చేస్తున్నారు.

ఈ భవనాలే నిదర్శనం

స్థానిక మండల పరిషత్ కార్యాలయ పరిధిలోని ఇంజినీరింగ్ కార్యాలయం, గెస్ట్ హౌస్ భవనం, హాస్టల్ భవనాల దుస్థితి చూస్తే మండలంలోని కార్యాలయాల పరిస్థితి తెలుస్తుందని ప్రజలు పేర్కొంటున్నారు. ఇంజినీరింగ్ కార్యాలయ భవనంపై అంతస్తులో పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగిపోవడంతో శ్లాబ్ లీకై భవనం శిథిలానికి చేరుకుంది. దీంతో భవనాన్ని ఆ శాఖ అధికారులు ఖాళీ చేసి, కొత్త భవనం నిర్మించారు. అదే విధంగా స్థానిక పెదపేటలోని బీసీ హాస్టల్ పరిస్థితీ అంతే. ప్రమాదకరంగా ఉండటంతో విద్యార్థుల్ని వేరే ప్రాంతానికి తరలించారు. అనంతరం అక్కడ సచివాలయ కార్యాలయం ఏర్పాటు చేసినా కార్యాలయం ఎప్పుడూ వర్షపు నీటితో నిండిపోవడంతో కార్యాలయాన్నీ ఖాళీ చేయించారు. ముఖ్యంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయం, పశువుల ఆస్పత్రి, ఆర్బీకే కేంద్రాలపై మొక్కలు శుభ్రం చేయించాలని ప్రజలు కోరుతున్నారు.


ఎంపీడీఓ కార్యాలయంపై అంతస్తులో విపరీతంగా పెరిగిన మొక్కలు


పశువుల ఆసుపత్రి పాత భవనంపై గార్డెన్‌ను తలపిస్తున్న మొక్కలు


ఆర్బీకే కేంద్ర షెడ్డుపై మొలిచిన మొక్కతో బీటలు వారిన గోడ

యనమదుర్రు డ్రెయిన్‌పై అప్రోచ్ రోడ్లు వేయాలి

భీమవరం: పట్టణంలో యనమదుర్రు డ్రెయిన్‌పై నిర్మించిన మూడు వంతెనలకు అప్రోచ్ రోడ్లు వేయాలని సీపీఎం భీమవరం పట్టణ శాఖ మహాసభ తీర్మానించింది. సోమవారం మెంటేవారి తోటలోని పార్టీ కార్యాలయంలో దండు బోయిన త్రిమూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాత బస్టాండ్ వద్ద అల్లూరి సీతారామరాజు మునిసిపల్ భవనాన్ని వెంటనే పునఃనిర్మించాలని సాంస్కృతిక కేంద్రంగా అభివృద్ధి చేయాలని, తక్షణం ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్లు ఇచ్చి నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని సమావేశం డిమాండ్ చేసింది. అనంతరం పట్టణ నూతనశాఖ కార్యదర్శిగా ఎస్ రంగాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసభలో చైతన్య ప్రసాద్, వడుగు వెంకటేశ్వరరావు, నజీర్, వేంద్ర సత్యనారాయణ, దండు బోయిన నాగమణి తదితరులు పాల్గొన్నారు.

న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి


కలెక్టర్ నాగరాణికి వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ సభ్యులు

భీమవరం(ప్రకాశం చౌక్): న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, లేకుంటే విధుల బహిష్కరిస్తామని ఎన్‌టిఆర్ వైద్యసేవ ఉద్యోగుల యూనియన్ సోమవారం జిల్లా కలెక్టర్ నాగరాణీ, ఎన్‌టిఆర్ వైద్య సేవ కోర్డినేటర్ డాక్టర్ కిర్తీకి పలు డిమాండ్‌లతో వినతిపత్రం అందజేశారు. గత 17 ఏళ్లుగా ఎన్‌టిఆర్ వైద్య సేవ పథకంలో వైద్య మిత్రలు,టీంలీడర్లు, జిల్లా మేనేజర్లు, ఆఫీస్ అసోసియేట్ తదితర క్యాడర్‌లో పనిచేయడం జరుగుతుందన్నారు. ఈనెల 27 తేదీ వరకు దశల వారిగా తమ నిరసన తెలియజేసి ప్రభుత్వం స్పందించకపోతే ఈనెల 29 నుంచి విధులు బహిష్కరించి పూర్తి స్థాయి సమ్మె చేపడతామని తెలిపారు.

భార్యపై భర్త దాడి

భీమవరం: పట్టణంలోని రెండో పట్టణంలోని ఎం.ఆర్ నగర్‌కు చెందిన ఎస్.దేవి భవానిని ఆమె భర్త రామకృష్ణ కొట్టడంతో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. వీరికి వివాహమై 10 ఏళ్లు అయ్యిందన్నారు. బాధితురాలు పుట్టింట్లో ఉండగా ఆదివారం వచ్చి కొట్టడంతో గాయపడిందని తెలిపారు. ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు ఏఎస్‌ఐ ఎం.మోహనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోటార్ సైకిల్ చోరీ

భీమవరం: పట్టణంలోని రెండో పట్టణ పరిధిలోని రైల్వే అండర్‌పాస్ సమీపంలో ఉంచిన తన మోటార్ సైకిల్ చోరీకి గురైందని ఉణుదుర్రుకు చెందిన టి.వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారని పోలీసులు తెలిపారు. ఈనెల 7వ తేదిన చోరి జరగగా అప్పటి నుంచి వెతికినా ప్రయోజనం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్సై రెహమాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దేవస్థానం భూమిలో ఆక్రమణల తొలగింపు


ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

నరసాపురం: పట్టణంలోని రుస్తుంబాద శివాలయం వద్ద దేవస్థానం భూమిలో ఆక్రమణలను అధికారులు సోమవారం తొలగించారు. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. పోలీసులు రంగ ప్రవేశం చేసి పరిస్థితి చక్కదిద్దారు. ఇటీవల రుస్తుంబాద ప్రాంతానికి చెందిన మామిడిశెట్టి వెంకటేశ్వరరావు, చింతా నానాజీలు దేవస్థానం భూమిలో ఓ కంటైనర్ పెట్టి, చిన్న షెడ్డు ఏర్పాటు చేశారు. దీంతో ఆలయ పూజారి ఈఓకు ఫిర్యాదు చేయడంతో తొలగింపు చేపట్టారు. అయితే తొలగింపును ఆక్రమణదారులు అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. ఇంతలో వీహెచ్‌పీ నాయకులు అక్కడికి చేరుకుని ఆలయ ఆస్తులు పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ నిరసనకు దిగడంతో ఎస్సై ముత్యాలరావు సిబ్బందితో కలిసి వచ్చి పరిస్థితి చక్కదిద్దారు.

బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


జన సురక్ష ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం(ప్రకాశం చౌక్): పీఎం సురక్ష బీమా యోజన, పీఎం జీవన జ్యోతి బీమా యోజన పథకాలను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ నాగరాణి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో గ్రామ స్థాయి జన సురక్ష కార్యక్రమం ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకాలను జిల్లాలో పెద్ద ఎత్తున ప్రచారం చేసేందుకు ఈనెల 15 తేదీ నుంచి జనవరి 15 వరకు మూడు నెలలు పాటు కార్యాచరణ రూపొందించడం జరిగిందన్నారు. జీవితంలో అనుకోని సంఘటనలు జరిగినప్పుడు ఆ వ్యక్తి కుటుంబానికి భరోసాగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం రెండు జన సురక్ష బీమా పథకాలను అందుబాటులో తీసుకువచ్చిందన్నారు. బ్యాంకు లేదా పోస్ట్ ఆఫీస్‌లో ఖాతా కలిగిన ప్రతి ఒక్కరూ ఈ పథకంలో చేరేందుకు అర్హులన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ జే ఉదయ భాస్కరరావు, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ఏ నాగేంద్ర ప్రసాద్, డి ఆర్ డి ఎ పి డి ఎం ఎస్ ఎస్. వేణుగోపాల్, డ్వామా పి డి డా. ఏ సి హెచ్ అప్పారావు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలి


ఉండి సెంటర్‌లో నిరసన కార్యక్రమం చేపడుతున్న సీపీఎం నాయకులు

ఉండి: అధికారంలోకి వచ్చాక విద్యుత్ చార్జీలు తగ్గిస్తానని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక విద్యుత్ ఛార్జీలు పెంచి మాట తప్పారని సీపీఎం మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస విమర్శించారు. ట్రూ అప్ ఛార్జీల పేరిట్ పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే రద్దు చేయాలని సోమవారం ఉండి సెంటర్‌లో సీపీఎం నాయకులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అధికారం కోసం అనేక వాగ్ధానాలు చేసిన చంద్రబాబు అధికారం అందిన వెంటనే ట్రూ అప్ చార్జీల పేరిట పేదల, సామాన్యులు, అద్దెకు ఉంటున్న వారి నడ్డి విరుస్తున్నారని అన్నారు. గతంలో వాడిన విద్యుత్‌కు ఇప్పుడు అదనపు సొమ్ములు చెల్లించాలని బిల్లులు ఇవ్వడం ఎంత వరకు సమంజసం? అని ప్రశ్నించారు. కూటమి నాయకుల వాగ్ధానాలు నమ్మి అత్యధిక మెజారిటీతో విజయాన్ని కట్టబెడితే జరిగిన వందరోజుల పాలనలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి శూన్యమని మండిపడ్డారు.ఈ వంద రోజుల్లో ఏం చేశారు? అని ప్రజలు నిలదీస్తారని వారికి సమాధానం చెప్పలేక సనాతన ధర్మం, తిరమల లడ్డూ కల్తీ అంటూ డైవర్ట్ రాజకీయాలు చేసిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధిపై దృష్టి సారించాలని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని లేని పక్షంలో ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.అలాగే రాష్ట ప్రభుత్వం తక్షణమే ట్రూ అప్ చార్జీలు, సర్ చార్జీలు, స్మార్ట్ మీటర్లు విధించడం వంటి చర్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొట్టాడ వెంకటేశ్వరరావు, కింతాడ రమేష్, మోపిదేవి రాము, నక్కా బాలకోటేశ్వరరావు, అళ్ళ గొల్లబ్బాయి, రత్నం తదితరులు పాల్గొన్నారు.

వీధిలైట్ల సమస్య పరిష్కరించాలని వినతి


విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ఉండి: మండలంలోని ఎన్నార్పీ అగ్రహారంలో వీధి లైట్ల సమస్యను పరిష్కరించాలని వైఎస్సార్ సీపీ నాయకుడు సూరవరపు వెంకటాచార్యులు విద్యుత్ అధికారులకు సోమవారం వినతి పత్రం అందజేశారు. ముఖ్యంగా గ్రామ పంచాయతీలో విద్యుత్ సమస్యతో పాటు లైన్‌మెన్ కొరత వల్ల ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఫిర్యాదులో పేర్కొన్నారు. మెయిన్ విలేజ్ తోట, ఎస్సీ, బీసీ కాలనీల్లో స్ట్రీట్‌లైట్ కేబుల్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కాలిపోయి రెండు నెలలు గడుస్తుందని ఎన్నిసార్లు విద్యుత్ అధికారులకు తెలియపరచినా లైన్‌మెన్ లేడంటూ సమస్య పరిష్కరించడం లేదని వివరించారు. దీనివల్ల వీధిదీపాలు వెలగకపోవడంతో పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. అధికారులు స్పందించి ఇప్పటికైనా చర్యలు తీసుకుని కాలిపోయిన కేబుల్ వేయడంతో పాటు లైన్‌మెన్‌ను కేటాయించాలని కోరుతూ ఫిర్యాదు అందజేశారు. ఈ ఫిర్యాదు ప్రతిలో సర్పంచ్ సూరవరపు కనకదుర్గ, ఎంపీటీసీ సభ్యురాలు మున్నలూరి సువర్ణలక్ష్మీతో పాటు గ్రామ పంచాయతీ బోర్డు సభ్యులు సంతకం చేశారు.

పంపనకు కవితా పురస్కారం


పంపన సాయిబాబును సత్కరిస్తున్న దృశ్యం

వీరవాసరం: అంతర్జాతీయ సామాజిక సేవ సంస్థ శ్రీ శ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఈ నెల 19,20 తేదీల్లో తాడేపల్లిగూడెంలోని బుద్దాల కన్వెన్షన్ హాలు నందు ప్రపంచ తెలుగు సాహితీ– కళా జాతర కార్యక్రమంలో వీరవాసరం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు పంపన సాయిబాబు పాల్గొని కవిత గానం చేశారు. మాతృభాష అభివృద్ధికి చేస్తున్న కృషిని అభినందిస్తూ తానాబుక్ ఆఫ్ రికార్డ్స్ నందు పంపన సాయిబాబుపేరు నమోదు అయిన సందర్భంగా పంపన సాయిబాబును స్థానిక ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తదితరులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పంపన సాయిబాబు మాట్లాడుతూ తెలుగు భాషా సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా తన వంతు కృషి చేస్తానని అన్నారు.

సమస్యలను పరిష్కరించాలని వినతులు

ఆకివీడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తమ సమస్యలను పరిష్కరించాలని ఎనిమిది ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీఓ సుహాసిని తెలిపారు. స్థానిక ముస్లిం వీధిలో నివాసాల మధ్య వాటర్ సర్వీసింగ్ సెంటర్, సిమ్మెంట్ కొట్టు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత ప్రజలు ఫిర్యాదు చేశారన్నారు. అయిభీమవరం రోడ్డులో ఇల్లు తొలగించినందున నివాస స్థలం కేటాయించాలని, మందపాడులో రోడ్డు ఆక్రమణ ప్రాంతాన్ని సర్వే చేయించాలని, నగర పంచాయతీలో సంతమార్కెట్‌ను అభివృద్ధి చేయాలని, స్థానిక వెంకయ్య వయ్యేరు వంతెన వద్ద నుండి పీడబ్ల్యూడీ ఆఫీసు వరకూ జాతీయరహదారి వెంబడి విద్యుత్ వీధి దీపాలు వేయాలని, స్థానిక ఎస్ టర్నింగ్ వద్ద జాతీయరహదారి సీసీ రోడ్డు గోతులు పడిపోయిందని, మరమ్మతులు చేపట్టాలని ఫిర్యాదులు అందాయన్నారు. ఈ ఫిర్యాదులను ఆయా శాఖలకు పరిష్కార నిమిత్తం పంపినట్లు తెలిపారు.

గంగానమ్మకోడులో వ్యర్థాలతో ఇబ్బందులు


ప్రధాన సెంటర్‌లో గంగానమ్మకోడు దుస్థితి

ఆకివీడు: స్థానిక గంగానమ్మకోడు వ్యర్థాలకు నిలయంగా మారింది. గతంలో ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిన ఈ బోదె ప్రస్తుతం రొయ్యలు, చేపల వ్యర్థాలు, కుళ్లిన పండ్లు, కూరగాయలకు నిలయంగా మారింది. ప్రధాన సెంటర్‌లో జాతీయరహదారికి ఉన్న తూరల వద్ద కొంత మంది వ్యర్థాల్ని పారవేస్తున్నారు. దీంతో పాదాచారులు, వాహనచోదకులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కూరగాయల మార్కెట్ వద్ద గంగనమ్మకోడు బోదెకు ఉన్న వంతెన తూరల దగ్గర కోడి, మేక, గొర్రె వ్యర్థాలు, ఇతర వ్యర్థాలు మురుగు కాల్వలో పారవేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. నగర పంచాయతీ శానిటరీ అధికారులకు చెప్పినప్పటికీ ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదని వాపోతున్నారు. గంగానమ్మకోడు డ్రెయిన్‌లో పూడికలు తీయిస్తున్నా వ్యర్థాలు వేయడంతో దుర్గంధం వెదజల్లుతోందని ఆవేదన వ్యకం చేస్తున్నారు. ఇప్పటికైనా నగర పంచాయతీ అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

మావుళ్లమ్మకు 18 గ్రాముల బంగారం సమర్పణ


ఎమ్మెల్యే అంజిబాబు చేతుల మీదుగా అమ్మవారికి బంగారం సమర్పిస్తున్న దాతలు

భీమవరం(ప్రకాశం చౌక్): మావుళ్లమ్మ అమ్మవారికి భీమవరంకి చెందిన వీరేంద్ర బాబు, దేవి కృష్ణ ప్రభ దంపతులు 18 గ్రాముల బంగారం సమర్పించారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు చేతుల మీదుగా బంగారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ ప్రధానార్చకులు బ్రహ్మ శ్రీ మద్దిరాల మల్లికార్జున శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్ధ ప్రసాదాలు అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మీ నగేష్ పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుకు చెరువు కేటాయింపుపై డిసెంట్


కొండయ్య చెరువు ప్రాంతాన్ని డంపింగ్ యార్డుకు ఇవ్వవద్దని డిసెంట్ ఇస్తున్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు

ఆకివీడు: సుప్రీంకోర్టు నిబంధనలను కాలరాస్తూ పంచాయతీ చెరువును డంపింగ్ యార్డుకు కేటాయించడం సరైన విధానం కాదని కౌన్సిల్‌లోని కొంత మంది సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. స్థానిక కౌన్సిల్ సమావేశ హాలులో సోమవారం అత్యవసర సమావేశం చైర్‌పర్సన్ జామి హైమావతి అధ్యక్షతన నిర్వహించారు. అజెండాకు తీసుకువచ్చిన ఏకైక అంశం స్థానిక కొండయ్య చెరువు ప్రాంతం 6.22 ఎకరాల్ని డంపింగ్ యార్డుకు కేటాయించాలని తీర్మానానికి తీసుకువచ్చారు. పట్టణంలో 7 ఎకరాల భూమిని డంపింగ్ యార్డుకు కేటాయించాలని గతంలో నగర పంచాయతీ జిల్లా కలెక్టర్ లేఖ రాయడంతో, దీనిపై తహసీల్దార్‌ను విచారణ చేసి నివేదిక పంపించాలని కలెక్టర్ ఆదేశించారని, ఆ ప్రకారం తహసీల్దార్ సూచనల మేరకు పట్టణంలోని 6.22 ఎకరాల కొండయ్య చెరువు ప్రాంతాన్ని డంపింగ్ యార్డుకు బదలాయించాలని తీర్మానం ప్రవేశ పెట్టారు. దీనిపై వైస్ చైర్మన్ పుప్పాల పండు, కౌన్సిలర్ నిమ్మల నాగేశ్వరరావు(నాగు) తీవ్రంగా వ్యతిరేకించారు. సుప్రీం కోర్టు ఆదేశాలను భేఖాతరు చేస్తూ తీర్మానం చేయడం సరికాదన్నారు. మంచినీటి చెరువుగా వినియోగించుకోవాల్సిన కొండయ్య చెరువును గత పాలకులు నిర్లక్ష్యం చేశారన్నారు. రోజు రోజుకూ పెరుగుతున్న జనాభాకు సరిపడే మంచినీటి వ్యవస్థను మన పూర్వీకులు ముందుగానే గుర్తించి చెరువులుగా కేటాయించారన్నారు. అజెండాలో పొందుపరచిన విధంగా ప్రస్తుతం పట్టణంలో 36,595 మంది జనాభా ఉన్నారనడం అసత్యమని, ప్రస్తుత జనాభా 50 వేలకు పైబడి ఉందన్నారు. రానున్న రోజుల్లో మంచి నీటి సమస్య మరింతగా తలెత్తే అవకాశం ఉందని పండు, నాగు చెప్పారు.

ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకోవాలి

చెరువులను చెరువులుగా ఉంచి, డంపింగ్ యార్డుకు ఆక్రమణల్లో ఉన్న భూముల్ని స్వాధీనం చేసుకుని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం, నగర పంచాయతీ పట్టణంలో సెంటు భూమి కొనే పరిస్థితిలో లేదన్నారు. పట్టణ పరిధిలో ఎకరం రూ. కోటి రూపాయల పైబడి ఉందని మంచి నీటి చెరువు అవసరాలకు కొత్తగా భూమిని కొనే పరిస్థితి లేదన్నారు. ప్రజాఅవసరాల్ని దృష్టిలో పెట్టుకుని కొండయ్య చెరువును మంచినీటి చెరువుగా అభివృద్ధి చేసి ప్రజలకు వినియోగంలోకి తీసుకురావాలన్నారు. పట్టణ పరిధిలో లెక్కకు మించి భూమి ఆక్రమణల్లో ఉందని, దానిని స్వాధీనం చేసుకుని డంపింగ్ యార్డుకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఎమ్మెల్యే పెద్ద మనస్సుతో దీర్ఘాలోచన చేయాలని వారు కోరారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు మోటుపల్లి కుమారి, మొహ్మద్ అస్రఫ్ ఉన్నీసా, తిరుమారెడ్డి మాధవి, జనసేన కౌన్సిలర్లు గోపిశెట్టి సత్యవతి, గుర్రాన నాగ లక్ష్మి తీర్మానాన్ని వ్యతిరేకిస్తున్నట్లు వేర్వేరుగా డిసెంట్ ఇచ్చారు. తాము తెలిపిన విధంగానే తీర్మానాన్ని మినిట్‌పుస్తకంలో రాయాలని సూచించారు. కొండయ్య చెరువు ప్రాంతాన్ని డంపింగ్ యార్డుకు కేటాయింపుపై మిగిలిన సభ్యులు మౌనంగా ఉన్నారు. అనంతరం టీడీపీకి చెందిన కౌన్సిలర్లు, జనసేనకు చెందిన ఒక కౌన్సిలర్ సమావేశం అయిపోయిందని వెళ్లిపోయారు. కమిషనర్ జి.కృష్ణ మోహన్ విలేకర్లతో మాట్లాడుతూ డిసెంట్ ఇచ్చిన కౌన్సిలర్లు మాత్రమే వ్యతిరేకించారని, చైర్‌పర్సన్‌తో పాటు మిగిలిన సభ్యులు ఆమోదం తెలిపారని చెప్పారు. కౌన్సిలర్ జిల్లా పెద్దిరాజు గైర్హాజరయ్యారు.